epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 01 | సంచిక : 57 | బుధవారం | 26.06.2024

## నాటేసిన.. బాషా..



- రైతులతో కలిసి వ్యవసాయ పనులు చేసిన జనగామ కలెక్టర్
- వ్యవసాయ శాఖపై స్పెషల్ ఫోకస్ పెట్టిన రిజ్వాన్ బాషా

2 లో.



## 'మత్తు'వదలరా..!

### డ్రగ్స్‌కు అడ్డుకట్ట వేయాలి

### నేడు మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం

**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :** 'మత్తు' ప్రస్తుతం సమాజాన్ని పట్టి పీడిస్తున్న ఓ మహమ్మారి ఇది.. నల్లమందు, మార్ఫిన్, హెరాయిన్, చరస్, గంజాయి, మారిజువానా, కొకైన్, ఎల్ఎస్‌డీ వంటి మత్తు పదార్తాలకు చిన్నా పెద్దా తేడా లేకుండా అంతా వ్యసన పరులుగా మారుతున్నారు. అయితే ఈ మత్తును చిత్తు చేసేందుకు ప్రపంచం యుద్ధం ప్రకటించింది. ఇందులో భాగంగానే జూన్ 26న (నేడు) అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచాన్ని మాదక ద్రవ్యాల నుంచి దూరం చేయాలన్న లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ డిసెంబర్ 7, 1987న చేసిన తీర్మానం 42/112 ప్రకారం ఏటా జూన్ 26న అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ తీర్మానం 1987 ఇంటర్నేషనల్ కాన్ఫెరెన్స్ ఆన్ డ్రగ్ అబ్యూస్ అండ్ ఇల్లిసిట్ ట్రాఫికింగ్ నివేదిక ఇతర అంశాల పై మరికొన్ని చర్యల కోసం సిఫార్సు చేసింది. ప్రపంచ వ్యాప్తంగా ది యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్ (యూఎన్ఓడీసీ) ఈ రోజున మత్తు పదార్థా వల్ల ఏర్పడే సమస్యలపై చైతన్యం కోసం అనేక అవగాహన కార్యక్రమాలను చేపట్టింది.

- మిగతా 2 లో..



## నీవి నీతిమాలిన రాజకీయాలు

- పార్టీ మారితే రాళ్లతో కొట్టాలన్నవ్.. మర్చిపోయావా..!
- సీఎం రేవంత్‌రెడ్డిపై ఫైర్ అయిన మాజీ మంత్రి కేటీఆర్

3

## ఓరుగల్లుపై సీఎం ఫోకస్

- అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు
- 28న వరంగల్‌లో పర్యటించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

3







## నాటేసిన కలెక్టర్

జనగామ కలెక్టర్ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తన దైన శైలీలో అందరినీ ఆకట్టుకుంటూ పాలన కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయ శాఖపై ఆయన ప్రత్యేక దృష్టి సారించి ముందుకు సాగుతున్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించేందుకు అధికారులను అప్రమత్తం చేస్తూ జిల్లా ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు. మరో వ్యవసాయంలో రైతులును సైతం చైత్యం చేసేందుకు అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. ఇందులో భాగంగానే మంగళవారం జిల్లాలోని వడ్లకొండ గ్రామంలో పర్యటించి నాట్లను పరిశీలించిన ఆయన మరో అడుగు ముందకుకేసీ మారబోయిన బుచ్చిరాములు రైతు పొలంలోకి నాట్లు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులకు పలు సూచనలు చేశారు. సెంద్రీయ ఎరువులను ఉపయోగించాలని, వాటి ద్వారా అధిక మంచి దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. - మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి

# ఐదురోజులు భారీ వర్షాలు

■ **హెచ్చరించిన ఐఎండీ**

**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణలో రాగల ఐదురోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఉత్తర తెలంగాణతో పాటు పలు జిల్లాల్లోకి వానలు కురుస్తాయని పేర్కొంది. మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని తెలిపింది. బుధవారం నుంచి గురువారం వరకు నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ, సిద్దిపేట, భువనగిరి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలో వర్షాలు పడుతాయని పేర్కొంది. ఇక గురువారం నుంచి శుక్రవారం వరకు ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయని వివరించింది.



## ‘మత్తు’వదలరా..!

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి ఏటా జూన్ 26న ప్రపంచ వ్యాప్తంగా మాదక ద్రవ్యాలను స్వాధీన పర్చుకుని దేశ దేశాల్లో బహిరంగంగా వాటిని తగులబెట్టడం, బహిరంగ సభలు, ప్రదర్శనల ద్వారా ప్రజలను చైతన్యపర్చడం మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను నిరోధించడం వంటి చర్యలను పెద్ద ఎత్తున ఐరాస ప్రోత్సహిస్తోంది.

**పదహారేళ్లకే వ్యసనపరులుగా..**


మాదక ద్రవ్యాలు మానసికస్థితిపై ప్రభావం చూపడమే కాకుండా శరీరంలోని అన్ని అవయవాలను అస్తవ్యస్తం చేస్తాయి. వాటికి బానిసలై ఒక్కసారిగా దూరమైన వారి ప్రవర్తన చాలా భిన్నంగా ఉంటుంది. వీటికి అలవాటు పడి ప్రాణాలు కోల్పోతున్న వారెందరో. ఇంతకు ముందు ఇరవై అయిదేళ్ల వయస్సులో వ్యసనాలకు లోనైన వారు ఇప్పుడు పదహారేళ్లకే ఈ పదార్థాలను వాడుతున్నారని నివేదికలు చెబుతున్నాయి. మత్తు పదార్థాల వాడకం వల్ల మెదడులో కొన్ని రసాయనాలు విడుదలవుతాయి. వాటిని ఎండార్ఫిన్స్ అంటారు. ‘మత్తు’ ఉంటేనే ఎండార్ఫిన్స్ విడుదలవుతాయి. అవి దొరకని సమయంలో వారు నీరసంగా కనిపిస్తారు. కుటుంబ విలువలు విచ్ఛిన్నం కావడం, కుతూహలం, పిచ్చెక్కిస్తున్న పోటీ, భావోద్వేగం, నిత్య జీవితంలో ఒత్తిడులు పెరుగుతాయి. చేతిలో డబ్బు బాగా ఆడడం యువకులు, పెద్దలు, వృత్తి నిపుణుల్లో మాదక ద్రవ్యాల వినియోగం పెరుగుతుండడానికి మరికొన్ని కారణాలుగా చెప్పొచ్చు. ఇక నగరాల్లోని మహిళలు చాలా మంది కోక్‌కు అలవాటు పడిపోతున్నారు. దానిని ఒకసారి వాసన చూస్తే ఆకలి నశిస్తుంది. చాలా గంటల పాటు శక్తివంతంగా ఉండేటట్లుగా చేస్తుంది. మహిళలు అనేక సమస్యల నుంచి తప్పించుకోవడానికి కూడా ఒక మార్గంగా మాదక ద్రవ్యాలను ఆశ్రయిస్తున్నారు.

**బంధాలు విచ్ఛిన్నం..**

వరల్డ్ డ్రగ్ రిపోర్ట్ ప్రకారం 2020లో 275 మిలియన్ల మంది డ్రగ్స్ వాడారు. 36 మిలియన్ల మంది డ్రగ్స్ వినియోగ రుగ్మతలతో బాధపడుతున్నారు. డ్రగ్స్ వాడకం వల్ల 2019లో దాదాపు అర మిలియన్ల మంది చనిపోయారు. ఇక గంజాయి చౌకగా దొరకడంతో చాలా మంది దీనికి బానిసలవుతున్నారు. మహారాష్ట్రకు చెందిన వారే ఎక్కువగా ఈ పంట సాగుచేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో అమాయక గిరిజనులకు మాయమాటలు చెప్పి వారి భూములను తక్కువ ధరకు కౌలుకు తీసుకుని అందులో నిషేధిత గంజాయి పండిరచి దొడ్డిదారిన రూ.లక్షలు గడిస్తున్నారనే ఆరోపణలున్నాయి. డ్రగ్స్ వల్ల 25 శాతం మంది శారీరక సమస్యలకు గురవుతారు. 42 శాతం ఒత్తిడికి, మానసిక సమస్యలతో బాధపడతారు. 25 శాతం మంది భార్యల నుంచి విడాకులు కోరుతున్నారు. 40 శాతం నేరపూరిత ఆలోచనలతో గడుపుతున్నారు. యువత 45 శాతానికి పైగా సెక్స్ లో విఫలమవుతున్నారు. 24 శాతం మంది స్థూలకాయంలాంటి సమస్యలతో బాధపడుతుంటారు. మద్యం మత్తులోనే 90 శాతం నేరాలు. ఘోరాలు జరుగుతున్నాయి. మాదక ద్రవ్యాలు నల్ల బజారులో అందుబాటులో ఉంటున్నాయి. వివిధ ప్రాంతాలలో సంకేత నామాలతో చెలామణిలో ఉన్నాయి. నల్లమందు, మార్ఫిన్, హెరాయిన్, చరస్, గంజాయి, మారిజువానా, కొకైన్, ఎల్‌ఎస్‌డీ ఇందులో ముఖ్యమైనవి. వీటిని కొందరు అక్రమ వ్యాపారాలతో దొంగ రవాణాకు పాల్పడుతూ కోట్లాది రూపాయలను గడిస్తుంటే, యువత వానిని వినియోగిస్తూ చెడిపోతున్నారు. ఒకసారి దీనికి బానిసలైన తర్వాత వీటిని సంపాదించడానికి ఎంతటి అకృత్యాలు, నేరాలు చేయడానికైనా వారు వెనుకాడరు. మాదక ద్రవ్యాల నిరోధానికి భారత ప్రభుత్వం నార్కోటిక్స్, డ్రగ్స్ అండ్ సైకోట్రాపిక్ సబ్స్టెన్సస్ చట్టాన్ని చేసింది. ఈ మత్తు మందులు పండిరచేవారు, వ్యాపారం చేసేవారు, కలిగి ఉన్నవారు చట్టపరంగా కఠినంగా శిక్షార్హులు. మారక ద్రవ్యాల వినియోగానికి అడ్డుకట్ట వేస్తూ, మాదక ద్రవ్యాలు తీసుకునే వారిని నేరస్థుల్లా చూడటం మానేసి, వారిని డీఅడిక్ట్ చేసేందుకు సహకారం అందించాల్సిన అవసరముంది. దీనికి తల్లి తండ్రులు, డాక్టర్లు, సమాజం అడ్డుకట్ట వేయాలి.

### నేడు జనగామలో ర్యాలీ..

**జనగామ, మన చౌరాస్తా :** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నేడు (మంగళవారం) జనగామలో అవగాహన ర్యాలీ నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు స్థానిక చౌరస్తా నుంచి నెహ్రూ పార్క్ వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం కామాక్షి ఫంక్షన్ హాల్ లో జరిగే సదస్సుకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ముఖ్య అతిథిగా పాల్గొనున్నారు.



# ఓరుగల్లుపై సీఎం ఫోకస్

- అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు
- 28న వరంగల్‌లో పర్యటించనున్న రేవంత్‌రెడ్డి

**వరంగల్, మన చౌరాస్తా :** వరంగల్ మహానగరంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పెషల్ ఫోకస్ చేశారు. హైదరాబాద్ మహా నగరంతో పాటు వరంగల్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. హైదరాబాద్ తర్వాత రెండో రాజధానిగా అన్ని అర్హతలున్న వరంగల్ నగరానికి ఔటర్ రింగ్ రోడ్డు తోపాటు, ఎయిర్ పోర్టు నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి కసరత్తు మొదలు పెట్టారు. వరంగల్ సమగ్రాభివృద్ధి కోసం సమీక్ష నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలోనే వరంగల్‌లో జూన్ 28న సీఎం పర్యటించనున్నారు. నగర అభివృద్ధి పనులపై హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించనున్నారు. కాకతీయ పట్టణ అభివృద్ధి సంస్థ పరిధిలో చేపట్టబోయే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులపై సమీక్ష చేస్తారు. అలాగే ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రజాప్రతినిధులతో పాటు అధికారులతో సమావేశం అవుతారు. ఆ రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు వరంగల్‌లోనే గడపనున్నారు. వరంగల్ సమీక్ష సమావేశానికి కావాల్సిన పూర్తి సమాచారాన్ని సిద్ధం చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి కార్యాలయం ఇప్పటికే ఆదేశించింది. అండర్ డ్రైనేజీ పనులు, ఎంజీఎం



హాస్పిటల్ అభివృద్ధి, నూతనంగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనులతోపాటు కూడా పరిధిలో ఉన్న పెండిరగ్ పనులపై అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. ఉత్తర తెలంగాణ అంతా వరంగల్ వైపు చూసేలా నగరాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని సీఎం రేవంత్ రెడ్డి గతంలోనే ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.



'మన చౌరాస్తా' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తి స్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'మన చౌరాస్తా' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9676400812

# రేవంత్‌పై కేటీఆర్ ఫైర్

**నీతిమాలిన పనులు చేస్తున్నారని మండిపాటు**



**హైదరాబాద్, మన చౌరాస్తా :** పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటున్న రేవంత్ తీరును ఎక్స్ వేదికగా కేటీఆర్ ఎండగట్టారు. ప్రచారంలో నీతులు మాట్లాడిన రేవంత్ రెడ్డి.. ప్రభుత్వంలోకి వచ్చాన నీతిమాలిన పనులు చేస్తున్నారని విమర్శించారు. 'ఒక పార్టీ తరఫున గెలిచి మరో పార్టీలో చేరడం నేరం. ఎమ్మెల్యేలు పార్టీ మారితే రాళ్లతో కొట్టిచంపమన్నారు. రాజీనామా చేయకుండా ఇతర పార్టీల్లో చేరితే ఊళ్ల నుంచే తరిమి కొట్టమన్నారు. కానీ ఇవాళ రేవంత్ రెడ్డినే.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇండ్లకు వెళ్లి మరీ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. ఏ ఎమ్మెల్యేనైనా రాజీనామా చేయకుండా పార్టీ ఫిరాయిస్తే.. రాళ్లతో కొట్టించే బాధ్యత తీసుకుంటా అన్నది మీరే.. అందుకే జవాబు చెప్పాల్సింది కూడా మీరే..' అని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ ప్రశ్నించారు.



## కండువా మార్చిన నేతలపై
# చర్యలకు సిద్ధం

- పార్టీ ఫిరాయింపులు అడ్డుకునేందుకు బీఆర్ఎస్ వ్యూహం..!
- ఒక్కరితో మొదలై ఐదుకు చేరిన ఫిరాయింపులు

హైదరాబాద్, మన చౌరాస్తా : ఎమ్మెల్యేలు వరుసగా పార్టీని వీడుతుండడంతో గులాబీ దళం అప్రమత్తమౌతోంది. ఇప్పటికే కండువా మార్చిన నేతలపై చర్యలకు సిద్ధమడంతో పాటు ఆయా ఎమ్మెల్యేలకు నిరసన తగిలేలా ఆందోళనలకు ప్లాన్ చేస్తోదంది. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుతో మొదలైన ఫిరాయింపుల పర్వం కొనసాగుతూనే ఉంది. రెండు రోజుల కింద జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ పార్టీని వీడటంతో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల సంఖ్య ఐదుకు చేరింది. ఈ ఇద్దరితో పాటు దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి గులాబీ కండువా మార్చి అధికార పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ తీరును ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సిద్ధమైంది బీఆర్ఎస్.. పార్టీ ఫిరాయింపులపై రాహుల్ గాంధీ గతంలో చేసిన వ్యాఖ్యలు, కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించింది. కొన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ నుంచి వేరే పార్టీలకు వెళ్లిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. మీ పార్టీ వీడితే చర్యలకు పట్టుబడుతున్నారు.. ఒక రాష్ట్రానికి ఒక రూల్ ఉంటుంది.. మరో రాష్ట్రానికి మరో రూల్ ఉంటుందా? అని కాంగ్రెస్‌ను నిలదీసేందుకు బీఆర్ఎస్ సిద్ధమైంది. మరోవైపు ఎమ్మెల్యేలు పార్టీ మారిన నియోజకవర్గాల్లో కొత్త ఇన్‌ఛార్జ్‌ను నియమించడంతో పాటు క్యాడర్ చేజారకుండా కసరత్తు చేస్తోంది. పార్టీలో కమిటీలు వేయాలని నిర్ణయించింది. మరోవైపు న్యాయపోరాటానికి సైతం సిద్ధమవుతోంది.

మన చౌరాస్తా 4
26.06.2024 బుధవారం
epaper.manachourasta.com

Local News

# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- రైతు భరోసాపై అభిప్రాయాల సేకరణ

**జనగామ, మన చౌరాస్తా :** రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ , హ్యాండ్లూమ్స్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం జిల్లాలోని గానుగుపహాడ్ రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంత్రి తుమ్మల అన్ని జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులు, రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతు భరోసా పథకం అమలు కోసం అన్ని జిల్లాల రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పాల్గొన్నారు. రైతుల అభిప్రాయాల సేకరణ నేపథ్యంలో జనగామ జిల్లాకు సంబంధించి రైతు కాకర్ల శ్రీనివాస్ తమ అభిప్రాయాన్ని తెలియజేశారు. పది ఎకరాల భూమి ఉన్న రైతులకు ఈ రైతు భరోసా పథకాన్ని అందించాలన్నారు. నిజమైన రైతులకు ఈ పథకం అందేలా చూడాలన్నారు. పేద రైతులకు, వ్యవసాయంపై మాత్రమే ఆధారపడే అర్హులైన లబ్ధిదారులకు ఈ పథకం అమలు చేకూర్చాలని కోరారు. అలాగే రైతు రుణమాఫీ కింద కౌలు రైతులకు ఆంక్షలు లేకుండా ఈ పథకాన్ని అందించాలని, క్షేత్ర స్థాయిలో పరిశీలన చేపట్టి, రైతులకు ఆరోగ్య కార్డులు ఇవ్వాలని రైతు మంత్రికి విజ్ఞప్తి చేశారు. అదే విధంగా జిల్లాలోని మూడు రైతు వేదికలలో పాల్గొన్న రైతుల నుంచి అభిప్రాయాలను రాతపూర్వకంగా సేకరించి, ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని వ్యవసాయ శాఖ మంత్రి అన్ని జిల్లాల వ్యవసాయాధికారులకు సూచించారు. వ్యవసాయ శాఖ మంత్రి ఆధ్వర్యంలో ఏర్పాటైన సబ్ కమిటీ రాష్ట్ర రైతాంగ అభిప్రాయాల మేరకే ఈ పథకం అమలుపై నిర్ణయం తీసుకుంటుందని భరోసా కల్పించారు. అనంతరం కలెక్టర్ అక్కడ ఉన్న రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



వర్షాకాలం నేపథ్యంలో వేసే పంట గురించి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఏఓ వినోద్ కుమార్, ఏఈఓలు, ఏఓలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ చామలను కలిసిన లోక్‌మంత్‌రెడ్డి

భువనగిరి ఎంపీగా ఎన్నికైన చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఢిల్లీలోని పార్లమెంట్‌లో మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం జనగామకు చెందిన కాంగ్రెస్ నేత, రెడ్డి సంక్షేమ సంఘం నాయకుడు ఆరుల్ల లోక్‌మంత్‌రెడ్డి ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేక్ కట్చేసి, పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. - జనగామ, మన చౌరాస్తా





## పోచన్నపేట పోస్ట్ మెన్ పదవీ విరమణ

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం పోచన్నపేట గ్రామ పోస్ట్ ఆఫీస్ పరిధిలో గత 30 ఏళ్లుగా సేవలు అందించిన కత్తుల లక్ష్మయ్య పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య, శోభ దంపతులను మండల పరిధి పోస్టల్ సిబ్బంది శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పోస్టల్ అధికార సిబ్బంది మాట్లాడుతూ పోచన్నపేట, నారాయణపురం, సదాశివపేట, కాశీనగర్ ప్రజలకు సమాచార ఉత్తరాలు పంచడంతో పాటుగా పింఛన్లు అందజేయడంలో లక్ష్మయ్య సేవలు మరువలేనివి అన్నారు. ఇన్నేళ్ల సర్వీసులో తనకంటూ ఒక పెన్షన్ లేకుండా , ఎలాంటి బెనిఫిట్స్ పొందకుండా పదవీ విరమణ చేశారు. కార్యక్రమంలో మండల పోస్టల్ అధికార సిబ్బంది, లక్ష్మయ్య కుటుంబ సభ్యులు ప్రేమలత, పవిత్ర, విజయ్, బంధుమిత్రులు పలువురు పాల్గొన్నారు.

## గుప్త నిధుల పేరుతో మోసం

- ఇద్దరు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీసీపీ

**కొడకండ్ల, మన చౌరాస్తా:** జిల్లాలోని కొడకండ్ల మండల కేంద్రంలో ఓ బాధితురాలి ఇంట్లో గుప్తనిధులు ఉన్నాయంటూ ఓ ప్రబుద్ధుడు ఆమెను మోసం చేశాడు. వేములవాడకు చెందిన కడమంచి రజనీకాంత్ గుప్తా నిధులు ఉన్నాయంటూ నమ్మబలికి రూ. 9.20 లక్షలు తీసుకున్నాడు. మరోసారి పూజ చేయాలంటూ రూ. 7 లక్షలు కట్టాలని అనడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. కొడకండ్ల ఎస్సై శ్రావణ్ కుమార్ వారి సిబ్బందితో కలిసి నిందితులు నరసింహ, సురేశ్‌లను పట్టుకొని డబ్బులను రికవరీ చేశారు. ఈ కేసు వివరాలను డీసీపీ రాజమహేంద్ర నాయక్ మంగళవారం వెల్లడించారు. గుప్త నిధులు ఉన్నాయంటూ గ్రామాల్లో ముఠాలు సంచరిస్తున్నారని, వారి మాటలను నమ్మొద్దని, ఇలాంటి వారు ఎవరైనా తారసపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కేసు ఛేదించిన వర్ధన్నపేట ఏసీపీ అంబటి నరసయ్య, పాలకుర్తి సీఐ గట్ల మహేందర్ రెడ్డి, ఎస్సై బండి శ్రావణ్ కుమార్ తదితరులను ఆయన అభినందించారు.

## నేటి ధర్నాకు తరలిరండి

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** గ్రామ పంచాయతీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26 (నేడు) జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించ తలపెట్టిన ధర్నాకు మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ ఉద్యోగులు తరలి రావాలని జేఏసీ నేత కొమురెల్లి శ్రీనివాస్ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, మల్టీ పర్పస్ విధానం నుంచి పంచాయతీ సిబ్బందిని విముక్తి చేయాలని, ఎవరి కేటగిరీల వారిగా వారే విధులు నిర్వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ముఖ్యంగా 51 జీవోను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో కారోబార్లు, సిబ్బంది కాళ్ల ప్రభాకర్, నాగయ్య, టేకులపల్లి రాజు, శ్రీనివాస్, రాజిరెడ్డి, దయాకర్, కిష్టయ్య, లలిత, శ్యామల, శ్రీనివాస్, అన్వర్, బాబుగౌడ్, సురేశ్, శేఖర్, ఆశోక్, లచ్చమ్మ, సుధాకర్, నర్సయ్య, సామెలు, సాయిబాబా, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



## మకాం మార్చేస్తున్న

# బేబమ్మ..!

**మన చౌరాస్తా, సినిమా :** ఉప్పెన సినిమాతో సూపర్ క్రేజ్ తెచ్చుకున్న కృతి శెట్టి ఆ సినిమాలో బేబమ్మ పాత్రతో తెలుగు ఆడియన్స్ కు దగ్గరైంది. తొలి సినిమాతోనే 100 కోట్ల క్లబ్ లోకి చేరి వావ్ అనిపించిన అమ్మడు ఆ తర్వాత దాదాపు ఏడు ఎనిమిది సినిమాల దాకా చేసింది.కానీ ఆ సినిమాలేవి అమ్మడికి లక్ తీసుకు రాలేదు. పైగా అమ్మడికి వరుస ఫ్లాపుల వల్ల ఆమెకు ఉప్పెనతో వచ్చిన పాపులారిటీ కూడా తగ్గిపోయింది.ఈమధ్యనే కృతి శెట్టి మనమే సినిమా ద్వారా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాతో కమర్షియల్ గా ఓకే అనిపించుకున్నా కృతికి పెద్దగా కలిసి రాలేదు. తెలుగులో మనమే తర్వాత మరో ఛాన్స్ కూడా లేదు. అందుకే కృతి శెట్టి తన పూర్తి ఫోకస్ తమిళ పరిశ్రమ మీద పెట్టాలని అనుకుంటుంది. ఆల్రెడీ అమ్మడు అక్కడ రెండు సినిమాల్లో నటిస్తుంది. ఆ రెండు కూడా సెట్స్ మీద ఉన్నాయి. తెలుగులో ఎలాగు పెద్దగా ఛాన్సులు లేవని భావిస్తున్న అమ్మడు కెరీర్ అంతా కూడా అగమ్యగోచరంగా మారింది. అందుకే కోలీవుడ్ మీద దృష్టి పెట్టాలని ఫిక్స్ అయ్యింది. అదీగాక అమ్మడు మలయాళంలో కూడా ఒక సినిమా చేస్తుంది కాబట్టి ఆమె అక్కడ అవకాశాలు వచ్చినా సరే చేయాలని అనుకుంటుంది. మొత్తంగా కృతి శెట్టి తొలి సిన్మా రిలీజ్ అయిన టైం లో పెద్ద స్టార్ హీరోయిన్ అవుతుందని అనుకోగా అమ్మడు మాత్రం ఇలా వచ్చి అలా వెళ్లినట్టుగా కెరీర్ మారిపోయింది.



# సెమీస్‌కు అఫ్గాన్

## హోరాహోరీగా టీ20 వరల్డ్ కప్

**మన చౌరాస్తా, క్రీడా విభాగం :**

ఒక్క దెబ్బతో రెండు పిట్టలు ఔట్.. అందులోనూ టీ20 ప్రపంచ కప్‌లో ఫేవరేట్ టీముల్లో ఒకటైన ఆస్ట్రేలియా తోపాటు బంగ్లా నిష్క్రమించాయి. సంచలన ప్రదర్శనతో ఆకట్టుకుంటున్న అఫ్గానిస్థాన్ టీ20 ప్రపంచ కప్ సెమీస్‌కు దూసుకుపోయింది. దీంతో ఆసీస్, బంగ్లాదేశ్ ఇంటిముఖం పట్టాయి. సూపర్ 8 గ్రూప్ 1 నుంచి భారత్‌తో పాటు అఫ్గాన్ సగర్వంగా నాకౌట్ స్టేజ్‌కు వెళ్లింది. గురువారం ఉదయం 6 గంటలకు దక్షిణాఫ్రికాతో తొలి సెమీస్‌లో అఫ్గాన్ తలపడనుంది. అదే రోజు రాత్రి 8 గంటలకు భారత్‌ఇంగ్లాండ్ జట్ల మధ్య రెండో సెమీస్ జరగనుంది. సూపర్ 8లో మూడు జట్ల భవితవ్యం తేల్చే చివరి మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. పొట్టి కప్‌లో సంచలన విజయాలు నమోదు చేస్తూ వస్తున్న అఫ్గాన్ ఈసారి కూడా పట్టు వదల్లేదు. లక్ష్యం చిన్నదైనా సరే బంగ్లాను కట్టడి చేసి విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గాన్ 115/5 స్కోరు చేసింది. గుర్బాజ్ (43) టాప్ స్కోరర్. అతడితోపాటు ఇబ్రహీం జద్రాన్ (18), రషీద్ ఖాన్ (19లి) విలువైన పరుగులు సాధించారు.

అనంతరం లక్ష్య ఛేదనలో బంగ్లాను 17.5 ఓవర్లలో 105 పరుగులకే ఆలౌట్ చేసింది. వర్షం కారణంగా డక్‌వర్త్‌లూయిస్ పద్ధతి ప్రకారం మ్యాచ్‌ను 19 ఓవర్లకు కుదించారు. టార్గెట్‌ను 114 పరుగులుగా నిర్ణయించారు. అఫ్గాన్ 8 పరుగుల తేడాతో విజయం సాధించింది. బంగ్లా ఇన్నింగ్స్‌లో ఓపెనర్ లిటన్ దాస్ (54) చివరి వరకూ క్రీజ్‌లో ఉన్నా తన జట్టును గెలిపించలేకపోయాడు. బంగ్లాదేశ్ నిష్క్రమణ 13 ఓవర్లప్పుడే తేలినా.. అఫ్గాన్ ఆశలకు గండి కొట్టేలా అనిపించింది. అయితే, కెప్టెన్ రషీద్ ఖాన్ (4/23), నవీనుల్ హక్ (4/26), ఫరూఖి (1/15), గుల్బాదిన్ (1/5) కీలక సమయంలో చెలరేగిపోయారు. బంగ్లాను ఒత్తిడికి గురి చేస్తూ వికెట్లు పడగొట్టారు. లిటన్‌తోపాటు సౌమ్యా సర్కార్ (10), తౌహిద్ (14) మినహా ఎవరూ రెండంకెల స్కోరు చేయలేదు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నవీనుల్ హక్ నిలిచాడు. ఈ వరల్డ్ కప్‌లో ఇప్పటికే న్యూజిలాండ్, ఆస్ట్రేలియాను అఫ్గాన్ ఓడిరచిన సంగతి తెలిసిందే.

## వరల్డ్ క్రికెట్‌లో ఒకే ఒక్కడు?



**మన చౌరాస్తా, క్రీడా విభాగం :** ప్రస్తుతం టీమిండియా కెప్టెన్‌గా కొనసాగుతున్న రోహిత్ శర్మ జట్టును ఎంత సమర్థవంతంగా ముందుకు నడిపిస్తున్నాడో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. గత ఏడాది ఇండియా వేదికగా జరిగిన వన్డే వరల్డ్ కప్ టోర్నీలో ఏకంగా టీమిండియా వరుస విజయాలు సాధిస్తూ ఓటమి ఎరుగని జట్టుగా ప్రస్తానాన్ని కొనసాగించింది.ఇలాగే ఒక్క ఓటమి కూడా లేకుండా ఫైనల్ వరకు దూసుకు వెళ్ళింది. కానీ ఫైనల్ లో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయింది. అయితే వరల్డ్ కప్ విజేతగా ఆస్ట్రేలియా నిలిచినప్పటికీ ఇక ప్రపంచ క్రికెట్ ప్రేక్షకులందరూ కూడా టీమిండియా పోరాట పటమను చూసి అసలు విజేత టీమిండియా అని భావించారు.అయితే ప్రస్తుతం వెస్టిండీస్, యూఎస్ వేదికగా జరుగుతున్న టి20 వరల్డ్ కప్ లో కూడా రోహిత్ శర్మ తన కెప్టెన్సీ తో ఇలాగే అందరిని ఫిదా చేసేస్తూ ఉన్నాడు. ఇక ఈ ప్రపంచకప్ లో కూడా ఒక్క ఓటమి లేకుండా టీమిండియా దూసుకుపోతుంది అని చెప్పాలి. కీలకమైన సూపర్ 8 దశలో కూడా టీమిండియా వరుసగా మూడు విజయాలు సాధించి సెమీఫైనల్ లో అడుగు పెట్టింది. కాగా ఇటీవల ఆస్ట్రేలియా తో జరిగిన మ్యాచ్లో రోహిత్ శర్మ ఎంత కసితీరా కొట్టాడో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. విధ్వంసం అంటే ఎలా ఉంటుందో చూపించాడు రోహిత్. సిక్సర్లు ఫోర్లతో చలరేగిపోయాడు అని చెప్పాలి. ఇలా ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్ లో సిక్సర్ల వర్షం కురిపించిన రోహిత్ శర్మ ఒక అరుదైన రికార్డు సృష్టించాడు. అంతర్జాతీయ టి20 లలో 200 సిక్సర్లు బాదిన ఏకైక క్రికెటర్గా నిలిచాడు రోహిత్ శర్మ. మిగతా ఏ ప్లేయర్ కూడా రోహిత్ శర్మకు దరిదాపుల్లో కూడా లేరు అని చెప్పాలి. 173 సిక్సర్లతో రెండవ స్థానంలో మార్టిన్ గాప్తిల్ ఉన్నాడు. ఆ తర్వాత స్థానంలో బట్లర్ 137, మాక్స్వెల్ 133, పూరన్ 132 సిక్సర్లతో ఇక టి20 ఫార్మాట్లో అత్యధిక సిక్సర్లు కొట్టిన బ్యాట్స్మెన్ గా టాప్ ఫైవ్ లో ఉన్నారు అని చెప్పాలి. కాగా ఇలా అద్భుతమైన ప్రదర్శన చేస్తూ సెమీఫైనల్ లో అడుగుపెట్టిన టీమిండియా అక్కడ డిపెండిరగ్ ఛాంపియన్ ఇంగ్లాండ్తో తలబడబోతుంది.

## రికార్డుల మోత..

**మన చౌరాస్తా, క్రీడా విభాగం :** టీ20 ప్రపంచ కప్ 2024 ఉత్కంఠ పీక్స్‌కు చేరుకుంది. టోర్నీ చివరి రౌండ్‌కు చేరుకుంది. ప్రపంచకప్‌లో సోమవారం భారత్, ఆస్ట్రేలియా మధ్య హోరాహోరీ మ్యాచ్ జరిగింది.ఈ మ్యాచ్‌లో భారత జట్టు అద్భుత ప్రదర్శన చేసి 24 పరుగుల తేడాతో విజయం సాధించింది. భారత్, కంగారూ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఇరు జట్ల నుంచి సిక్సర్ల వర్షం కురిసింది. టీ20 ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక సిక్సర్లు బాదిన మూడో మ్యాచ్ ఇదే కావడం గమనార్హం. ఇటువంటి పరిస్థితిలో టీ20 ప్రపంచ కప్‌లో అత్యధికంగా సిక్సర్లు కొట్టిన మూడు మ్యాచ్‌ల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.. సోమవారం భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన టీ20 ప్రపంచకప్ 2024 మ్యాచ్‌లో బ్యాట్స్‌మెన్స్ సిక్సులతో దంచి కొట్టారు. ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు అధిక సంఖ్యలో సిక్సర్లు బాదాయి. ఈ మ్యాచ్‌లో మొత్తం 24 సిక్సర్లు నమోదయ్యాయి. ఇందులో భారత జట్టు 15 సిక్సర్లు, ఆస్ట్రేలియా జట్టు 9 సిక్సర్లు కొట్టాయి. భారత్ తరపున కెప్టెన్ రోహిత్ శర్మ అత్యధికంగా 8 సిక్సర్లు బాదాడు. ఈ మ్యాచ్‌లో రోహిత్ 41 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్సర్ల సాయంతో 92 పరుగులతో తుఫాను ఇన్నింగ్స్ ఆడాడు. 2010 టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాభారత్‌ల మధ్య జరిగిన మ్యాచ్‌లోనూ అత్యధిక సిక్సర్లు నమోదయ్యాయి. ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు తొలుత బ్యాటింగ్‌కు దిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 16 సిక్సర్లు కొట్టింది. దానికి సమాధానంగా ఈ మ్యాచ్‌లో భారత్ 8 సిక్సర్లు కొట్టింది. ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఓపెనర్ డేవిడ్ వార్నర్ అత్యధికంగా 7 సిక్సర్లు కొట్టాడు. భారత్‌కు చెందిన రోహిత్ శర్మ 6 సిక్సర్లు కొట్టాడు. 2014 టీ20 ప్రపంచకప్‌లో ఐర్లాండ్, నెదర్లాండ్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఇరు జట్ల బ్యాట్స్‌మెన్లు సిక్సర్ల వర్షం కురిపించారు. ఈ మ్యాచ్‌లో ఐర్లాండ్ 11 సిక్సర్లు కొట్టింది. కాగా, ఈ మ్యాచ్‌లో నెదర్లాండ్స్ సంచలనం సృష్టించి 19 సిక్సర్లు కొట్టింది. స్టీఫెన్ మైబర్గ్ ఈ మ్యాచ్‌లో అత్యధికంగా 7 సిక్సర్లు కొట్టాడు. అతని తర్వాత టామ్ కూపర్ 6 సిక్సర్లు కొట్టాడు. ఈ మ్యాచ్‌లో మొత్తం 30 సిక్సర్లు బాదగా, టీ20 ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక సిక్సర్లు కొట్టిన మ్యాచ్ ఇదే కావడం విశేషం.